క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ యువగర్జన సభ

బోధన్: ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలోని శక్కర్‌నగర్ ఎన్ఎస్ఎఫ్ మైదానంలో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువగర్జన సభను నిర్వహించనున్నారు. దీనికోసం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరవుతారని నాయకులు తెలిపారు. భారీ సంఖ్యలో యువతను సమీకరించేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సభకు హాజరుకానున్నారు.

సభను విజయవంతం చేయాలి



నవీపేట : బోధన్‌లో నిర్వహించనున్న యువగర్జనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు మంత్రి సాయికుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. యువగర్జనకు యువకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు ప్రవీణ్‌కుమార్, తాహెర్, వడ్డె రవి, మోషీజ్, అర్షద్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ఆకస్మిక తనిఖీ



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు, శిశువులకు టీకాల కార్యక్రమాన్ని, మాతాశిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. రిజిస్టర్లను సక్రమంగా ఉంచాలని, వివరాలు ప్రతిరోజూ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రతి గురు, శుక్రవారం ఆశ, ఆరోగ్య కార్యకర్తలు క్షయ సర్వే చేసి అనుమానితులను గుర్తించాలన్నారు. కేంద్రానికి వచ్చిన బాలింతలకు , గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సరోజ, ఆశ వర్కర్లు స్రవంతి, అరుణ, కమల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



ఆర్మూర్‌టౌన్: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో, మెప్మా ఆధ్వర్యంలో పెర్కిట్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నీలిమ, సీవోలు సంతోష్, రాజలింగం, మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మందకృష్ణ రాక

మాక్లూర్: నందిపేటలో గురువారం నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభకు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని నియోజకవర్గ ఇన్‌చార్జి సరికెల పోశెట్టి తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నందిపేటలోని మాదిగబస్తీలో మధ్యాహ్నం 12 గంటలకు మహాసభ ప్రారంభమవుతందన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పోశెట్టి కోరారు. జంగం సాయికుమార్, మల్లయ్య, సతీశ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రుద్రూర్: తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్నభోజన ఏజెన్సీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోటగిరి మండల విద్యావనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, బిల్లులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుబాస్ రాములు, ఓమయ్య, మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నవీపేట : మండలంలోని మిట్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆ పార్టీ మండల నాయకుడు, బినోల సొసైటీ మాజీ చైర్మన్ వక్కెర్ల కిశోర్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైన పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

అణగారినవర్గాల వ్యతిరేకి కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్: కాంగ్రెస్.. బీసీ, దళిత, మైనార్టీ సామాజిక వర్గాలకు వ్యతిరేకి అని, జిల్లాలో ఇప్పటి వరకు ప్రకటించిన బోధన్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే టికెట్లు ఆ పార్టీ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వడంతోనే ఈ విషయం స్పష్టమైందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకుడిని సీఎం చేస్తామని ప్రకటించే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా అని ప్రశ్నించారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందన్నారు. ప్రజలు అరవై ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రూ.200 పింఛన్లు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. పట్టణంలోని షకీల్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు శేఖర్, శ్రీనివాస్‌రావు, శక్కర్‌నగర్ ముఖ్య నాయకులు రాంబాబు, నాగులు,పలువురు కాలనీవాసులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా షకీల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నవీపేట మండలం మిట్టాపూర్ గ్రామస్తులు బీఆర్ఎస్‌లో చేరారు. బోధన్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ అని, కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంటుందని షకీల్ అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రయాదవ్, అబ్దుల్ రహమాన్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, శివాలయం కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఎడపల్లి (బోధన్) : ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపులో ముందుండాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. ఎడపల్లి మండలం బషీర్ ఫారం వద్ద మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలోఉన్న సమస్యలపై కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రతిఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

బాల్కొండలో గంజాయిని నిర్మూలిస్తా



కిసాన్‌నగర్‌లో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

బాల్కొండ: తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత బాల్కొండ నియోజకవర్గంలో గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తానని బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్, కిసాన్‌నగర్ గ్రామాల్లో బుధవారం అన్నపూర్ణమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. ప్రశాంత్‌రెడ్డి, ఆయన సోదరుడు అజయ్‌రెడ్డి నియోజకవర్గంలోని గ్రామాల్లో గంజాయిని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు అంబటి నవీన్, చిన్నయ్య, లింగయ్య, సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభను విజయంతం చేయాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. అంకాపూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క రూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశం అనంతరం ఇస్సాపల్లిలో నిర్వహించిన ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ తల్లి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేయిస్తా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్

బోధన్‌టౌన్(బోధన్): ఎన్నికల ప్రచారానికి వచ్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే తన భార్యతో కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయించి ఇక్కడి నుంచి వెళ్లిపోతానని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం చక్కెర కర్మాగారానికి చెందిన భూమి కబ్జాకు గురవుతుంటే.. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న వార్డువాసులు అడ్డుకొని కోర్టుకు వెళ్లారని అన్నారు. తాను డబ్బులు తీసుకొని ఆ భూమిని వేరే వారికి అప్పగించానని ఆరోపిస్తున్నారని, నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమన్నారు. శరత్‌రెడ్డి దొంగ బీసీ సర్టిఫికెట్ తీసుకువచ్చి చైర్‌పర్సన్ పదవిని కై వసం చేసుకున్నాడని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్ సుధారాణి, ఫ్లోర్ లీడర్ గంగారాం, నాయకులు పెర్క స్వామి, రేకం దాసు, రవిశంకర్‌గౌడ్, వాసు, వెంకట్ నాయకులు, కార్యకర్తలు, వార్డువాసులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించండి

- రైతులకు ఉచితకరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే
- రాష్ట్రంలో మేం కట్టిన ప్రాజెక్టులే సాగునీటి కష్టాలను తీర్చాయి
- మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న పి సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్(బోధన్): ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని మాజీమంత్రి, ఆ పార్టీ అభ్యర్థి పి సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని కల్దుర్కి, బండార్‌పల్లి, రాంపూర్, సిద్ధాపూర్, ఖండ్‌గావ్, బిక్నెల్లి గ్రామాల్లో బుధవారం సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మొట్టమొదటిసారిగా ఉచిత కరెంట్‌ను అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులతోనే సాగునీటి కష్టాలు తీరాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చినప్పటికీ.. ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎమ్మెల్యేగా షకీల్ విఫలమయ్యారని విమర్శించారు. అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తే ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్‌లో చేరగా సుదర్శన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మాజీ జెడ్పీటీసీ అల్లె లావణ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 3 నుంచి 144 సెక్షన్ అమలు

- ఏసీపీ కిరణ్‌కుమార్



బోధన్‌టౌన్(బోధన్): నామినేషన్ల స్వీకరణ సందర్భంగా బోధన్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఈనెల 3 నుంచి 16వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. నామినేషన్ల దాఖలు, విత్‌డ్రా ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో కలిపి ఐదుగురికే మందికే అనుమతి ఉంటుందని, ఆర్డీవో కార్యాలయానికి 500 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు, నాయకులు గుంపులుగా ఉండవద్దని సూచించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నెరవేర్చని హామీలపై సీఎంను నిలదీయండి



విలేకరులతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి ఓట్ల కోసం ప్రచార సభలను నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కే చంద్రశేఖర్‌రావును నిలదీయాలని రైతులకు కాంగ్రెస్ బాల్కొండ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోర్తాడ్‌లో నిర్వహించిన సభలో పసుపు, ఎర్రజొన్నలను తామే కొనుగోలు చేస్తామని 2018 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఎన్నడూ కూడా రెండు రకాల పంటలను కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రైతులందరికీ రుణమాఫీ అందలేదని, పంటలకు నష్టపరిహారం ప్రకటించినా.. ఇప్పటి వరకు పరిహారం అందకపోవడంపై సునీల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హామీలను నెరవేర్చి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆయన సూచించారు. సీఎంను, మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ప్రశ్నించాలని రైతులను కోరారు. సమావేశంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్‌కు చెందిన రెడ్‌బుల్స్ యూత్, శివాజీయూత్ సభ్యులు, మానాల, చౌట్‌పల్లి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. మోర్తాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సుంకెట రవి, పడిగెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాక్లూర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మాక్లూర్ ఎస్సై సీహెచ్ సుధీర్‌రావు ఆధ్వర్యంలో విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు స్మార్ట్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో క్రైం సీఐ ఎండీ పాషా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గణేశ్, ప్రొఫెసర్లు శ్రీకాంత్, ప్రకాశ్‌పాటిల్, స్వప్న, వాసుగౌడ్, శివరంజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా పేదలకు ఇండ్లు కట్టిస్తా



మారంపల్లిలో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏడాదిలోగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు కట్టిస్తానని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఒకవేళ ఇచ్చిన మాటను తప్పితే తానే స్వయంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. డొంకేశ్వర్ మండలం మారంపల్లి, నూత్పల్లి, గంగసరం గ్రామాల్లో బుధవారం రాకేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మారంపల్లికి అల్లుడైనప్పటికీ గ్రామంలో అభివృద్ధి జరగకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల్లా బీజేపీ దొంగహామీలు ఇవ్వదని, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గ్రామాల్లో మొదటగా ఇండ్ల నిర్మాణాలకు కొబ్బరికాయ కొడుతానన్నారు. కష్టాల నుంచి వచ్చిన వ్యక్తిని కాబట్టే ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు గంగాధర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచులు

డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్పూర్ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు నర్సాగౌడ్, ఎర్ర భోజన్న బీజేపీలో చేరారు. పైడి రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం



బోధన్: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. బోధన్ పట్టణంలోని ఎంపీఆర్ ఆఫీసులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎడపల్లి మండలం ఠానాకలాన్‌కు చెందిన 40 మంది యువకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాజువర్మ, సోమ వెంకటేశ్, వినోద్, మాధవ్, నవీన్, ఆనంద్, వినయ్, గణపతి, దినేశ్‌గౌడ్, సాయికిరణ్, మధు బీజేపీలో చేరినవారిలో ఉన్నారు. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యాల్ల సాయిరెడ్డి, మార చంద్రమోహన్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు యాల్లసాయిరెడ్డి, మార చంద్రమోహన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం బూత్‌కమిటీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వినయ్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని, కార్యకర్తలు సైతం భారీ ఆధిక్యం వచ్చే విధంగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కోలా వెంకటేశ్, విట్టం జీవన్, చిన్నారెడ్డి, సాయిబాబాగౌడ్, మీర్ మాజీద్, ఫాయిమ్, గంగాధర్, చేపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం



కమ్మర్‌పల్లి: పాఠశాల విద్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణను బుధవారం ప్రారంభించారు. బాలికల ఆత్మరక్షణ కోసం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలలకు 3 నెలలపాటు శిక్షణ ఇస్తామని హెచ్ఎం సాయన్న తెలిపారు.

విద్యారంగాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్

బోధన్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని టీజీవీపీ (తెలంగాణ విద్యార్థి పరిషత్) డివిజన్ కన్వీనర్ మీనాలే నాగేశ్ అన్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టుపట్టించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించారు. సివిల్ సర్వీస్, గ్రూప్స్ పరీక్షలు సరిగా నిర్వహించలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి వెళ్లి వివరిస్తామని అన్నారు. నాయకులు మాధవ్, శివశంకర్, ఆదిత్య, శివరాజ్, సతీశ్, గంగాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూపసభను విజయవంతం చేయాలి

- సభకు ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ రాక
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప సభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని, ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో నిర్వహించిన విశ్వరూపసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ప్రయత్నిస్తున్నామని, ఏ పార్టీ అధికారంలో ఉన్నా వర్గీకరణ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల కోసం మాదిగబిడ్డలు పని చేస్తే, ఆ పార్టీలు అధికారంలోకి వస్తాయని, వాళ్లలో ఒక్కరు ముఖ్యమంత్రి అవుతారని, మాదిగలకు ఒరిగేదేమీ లేదన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ మాదిగలపై కేసులు చేశారని, ఒక్క రోజు కూడా వర్గీకరణ గురించి మాట్లాడలేదని విమర్శించారు. బిడ్డ కవిత కోసం ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్.. ఎస్సీ వర్గీకరణ కోసం ఒక్కసారైనా ఢిల్లీకి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. పార్టీల ప్రచారం కోసం తిరిగితే మన బిడ్డల భవిష్యత్ మారదని, మాదిగ దండోరా కోసం తిరిగితే తలరాత మారుతుందన్నారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాతాసూర్యవంశీ, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకరారం రమేశ్, కో-కన్వీనర్ లక్ష్మీగారి భూమయ్య, మారుతి, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేములకు కర్షకసంఘం మద్దతు

భీమ్‌గల్: పట్టణంలోని కర్షకుల సంఘం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచింది. ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికి సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానప్రతిని బుధవారం వేల్పూర్‌లో అందజేశారు. అనంతరం ఎన్నికల ఖర్చునిమిత్తం రూ. 50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ఆనందం వ్యక్తం చేస్తూ, భీమ్‌గల్ కర్షకుల సంఘానికి ధన్యవాదాలు తెలిపారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి

ఆర్మూర్‌టౌన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ వెంటనే దాడులను ఆపాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని షాదీఖానా ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలస్తీనా ప్రజల పోరాటానికి న్యూడెమోక్రసీ సంఘీభావం ప్రకటిస్తున్నదన్నారు. యుద్ధధర్మాన్ని విస్మరించి, ఇజ్రాయిల్ గాజాలోని పాఠశాలల, ఆస్పత్రులపై దాడులు చేస్తూ వేలాది మంది పిల్లలు, మహిళలను బలి తీసుకుంటున్నదన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు దాసు, సూర్య శివాజీ, ఎండీ ఖాజామొహినొద్దీన్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్, నాగాపూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు, వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు బుధవారం బీజేపీలో చేరారు. మండలంలోని చౌట్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్, మండలాధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

పైడి రాకేశ్‌రెడ్డి సమక్షంలో..

పెర్కిట్/మాక్లూర్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌తోపాటు మండలంలోని మంథనికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. మామిడిపల్లిలో బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా మత్స్యకార పరిశ్రమల సహకార సంఘం అధ్యక్షుడు బిండి పెంటయ్య, మంథని లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్‌తోపాటు గంగపుత్ర సంఘం సభ్యులు బీజేపీలో చేరారు. మాక్లూర్ మండలం మాందాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, వీడీసీ సభ్యులు మాజీ జెడ్పీటీసీ లతాపీర్‌సింగ్, మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వీడీసీ అధ్యక్షుడు కమలాకర్, ఉపాధ్యక్షుడు ఊషన్న, సందీప్, దుర్గానగర్‌కు చెందిన సత్యమ్మ, వెంకటేశ్‌గౌడ్, అనిల్‌కు రాకేశ్‌రెడ్డి కండువాలు కప్పారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	లింగోచ్చా(తెలుగు) - 1.45, ఒక్కడే-1 (తెలుగు) - 4.45, మార్టిన్ లూథర్ కింగ్(తెలుగు) - 7.25, ఓటు (తెలుగు) - 10.30
స్క్రీన్-2	భగవంత్ కేసరి (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3	లియో (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4	మార్టిన్ లూథర్ కింగ్ (తెలుగు)-12.05, నాగేశ్వరరావు-3.10, 6.35, 10.00